
# ఏ ట్రయిన్ ఫ్రమ్ మసులా!




**నా**కు హైదరాబాదు నుంచి బెజవాడకు ట్రాన్స్ఫర్ అయింది. బెజవాడ ఆఫీసులో నా పాత మిత్రుడు భగవాన్ కనిపించాడు.

“ఇల్లెక్కడ తీసుకున్నావ్?” అడిగాడు భగవాన్.

“ఎక్కడా తక్కువ అద్దెలో దొరకటంలేదు!” అన్నాను దిగులుగా.

“అన్నట్లు నీకు బందర్లో ఓ ఇల్లుంది ఇదూ?”

“అవును! ఉంటే ఏం లాభం?”

“అక్కడే వుండి రోజూ బెజవాడ ట్రెయిలో వచ్చి సాయంత్రం వెళ్ళిపోవడం బెస్టు! చాలామంది అదేపని చేస్తుంటారు.”

నా కా అయిడియా నచ్చింది. వెంటనే బందర్లో సెటిలయిపోయి రైల్వేస్టేషన్ కెళ్ళి సీజన్ టికెట్ తీసుకున్నాను.

మొదటిరోజు పొద్దున్నే స్టేషన్ చేరుకుని రైలెక్కి కూర్చున్నాను. తొమ్మిదిన్నరకల్లా బెజవాడ వెళ్ళిపోవచ్చు. మళ్ళీ సాయంత్రం ఎనిమిదింటికల్లా బందరు చేరుకోవచ్చు. రైల్వే ఇంత

అభివృద్ధి చెందటం నాకెంతో ఆనందం కలిగించింది. నా చిన్నప్పుడు బందరు బెజవాడ రైలు విజయవాడ చేరటానికి అరుగంటలుపట్టేది. ఇప్పుడు కేవలం మూడేగంటలట! భగవాన్ చెప్పాడు. రైలు కదిలేవేళయేసరికి కారేజ్‌లో సగం వరకు జనం నిండిపోయారు. నిజంగా బస్ ప్రయాణం కంటే రైలు ప్రయాణం ఎంతో సరదాగా వుంటుంది. అనేక ఊళ్ళవాళ్ళు కలుసుకోవడం మాట్లాడుకోవడం–

రైలు బందరు స్టేషన్ వదలగానే ప్రయాణీకులు అర్జంటుగా రాజకీయాలు మాట్లాడేసుకోసాగారు.

"ఎన్టీఆర్ మనకు చేసిందేమిటి? అని నేను కొశ్చెన్ చేస్తున్నాను! తెలుగు ప్రజల ఆత్మగౌరవం తగలబడిపోతోందహో అని కన్నీరు కార్చాడు– మరి మద్రాస్ నుంచి ఓ తమిళుడిని తీసుకొచ్చి తనకు కార్యదర్శిగా నియమించుకున్నప్పుడు తెలుగువాళ్ళ ఆ ఆత్మగౌరవం ఏమయింది? అనేన్నను కొశ్చెన్ చేస్తున్నా! అంతేకాదు, కిలో రెండు రూపాయల బియ్యం ఏవి? ఎవరిస్తున్నారు అని కూడా నేను కొశ్చెన్ చేస్తున్నాను."

ఆ గురుడి ఉపన్యాసం ఎంతవరకూ కొనసాగేదోగాని ఈలోగా ఆ కారేజిలోకి ఓ వర్తక శిఖామణి వచ్చి వేలంపాట ప్రారంభించేసరికి అతను చప్పబడిపోయాడు.

"ఈ అద్భుతమైన సూపర్ డీలక్స్ స్టీలు గిన్నె, ఈ దంతపు దువ్వెనా కలసి కేవలం అర్థరూపాయి మాత్రమేనండీ. ఒకటోసారి రెండోసారి– డెబ్బయి ఆరురూపాయల స్టీలు గిన్నె, పధ్నాలుగు రూపాయల దువ్వెన కలిసి కేవలం అర్థరూపాయి మాత్రమేనండీ."

అంతకుముందే కారేజిలోకి వచ్చి కూర్చున అతని అసిస్టెంటే కాబోలు, వాటిని బాగా పరీక్షించి "అయిదు రూపాయలు" అన్నాడు.

సరే ఈ తతంగం తెలిసిందే కాబట్టి నవల తెరిచి చదువుకోసాగాను.

కాసేపటి తర్వాత చూస్తే రైలు ఏదో స్టేషన్‌లో ఆగిపోయివుంది. క్రాసింగట. అరగంట తర్వాత బయల్దేరింది మళ్ళీ. ఆ తర్వాత రెండో స్టేషన్‌లో ఆగిపోయి కదల్లేదు.

"ఎందుకిక్కడ ఆగిపోయింది మన బండి" పక్కనున్నతన్ని అడిగాను.

"స్టేషన్‌లో పాలవాళ్ళు పాలు తక్కువ పోశారట. గొడవ జరుగుతోంది." అన్నాడు

అదేమిటో చూద్దామని రైలుదిగి గొడవ జరుగుతున్నచోట కెళ్ళాను.

టికెట్ కలెక్టర్ కాబోలు పాలకాన్‌ల దగ్గర నిలబడ్డాడు.

"అది కాదండీ. మొన్న తక్కువపోశారు. సరేనన్జెప్పి. పట్టించుకోలేదు. చూడండి! ఇవాళకూడా ఈ గిన్నెలో సగానికి పోశారు. ఇది కావాలని చేయటం కాదంటారా?"

కోపంగా అన్నాడతను మరో పాలు అమ్మే పెద్దమనిషితో.

"ఎందుకొచ్చిన గొడవరావుడూ! లెక్కప్రకారం స్టేషనోళ్ళకి పోసేయకూడదూ?"

రావుడు తిరగబడ్డాడు.

"గొడ్లు రెండు ఎండిపోయినయ్! అందుకని తగ్గించాను. అయినాగాని ఊరికే బేవర్సుగా వచ్చేపాలు- కొంచెం తగ్గితేనేం?" పౌరుషంగా అన్నాడు రావుడు.

"ఏటి? బేవార్సుగా పోస్తున్నావా?" కోపంగా అడిగాడు టి.సి.

"అవును! మేమందరం బేవర్సుగా పోయకపోతే మీ రైలోళ్ళు ఏ రోజయినా డబ్బెట్టికొన్నారా?"

"ఎవడికోసం పోస్తారయ్యా? మీరు పదిరూపాయలు పాలు ఊరికేపోసి వందరూపాయలు లాభం మా దగ్గర్నుంచీ దొబ్బుతున్నారు.'

"మీలాటోళ్ళుంటే లాభాలు గాడిదగుడ్డొస్తాయ్."

గుంపుని నెట్టుకుంటూ స్టేషన్‌మాస్టర్‌లోపలకు జొరపడ్డాడు.

"ఏమిటయ్యా గొడవ! బండికి ఆలస్యం అయిపోతుంది" అన్నాడాయన మందలింపుగా.

"ఆ టికెట్ కలెక్టర్ని పాల డబ్బాలు వదలమనండి- వెళ్ళిపోతాం! మాదేం ఆలస్యం వుంది?" అన్నాడు రావుడు.

"వదిలేయవయ్యా ఎందుకొచ్చిన గొడవ?" విసుకున్నాడు స్టేషన్ మాస్టర్.

"మీ కోటాపాలు మీకు వచ్చేశాయి గనుక మీరు వదలమంటారండీ! అనకేంజేస్తారు?" కోపంగా అన్నాడు టి.సి.

ఆ మాటతో స్టేషన్‌మాస్టర్ కింకేమనాలో తెలీలేదు.

"సరే- ఈ రోజుకి పోనీ! రేపు సంగతి చూద్దాం" అన్నాడు రాజీధోరణిలో

"ఎలా పోనిస్తానండి! మా చంటిదానికి పాలు పట్టించాలా? మా పెద్దాడికి పాలివ్వాలా, పెరుగు తోడెయ్యాలా- మా ఆవిడా, నేనూ తాగాలా? ఎట్టా సరిపోతాయి ఇంతమందికీ పాలు? మీకు తెలుసో తెలీదో- రెండ్రోజుల్నుంచీ జేబులో డబ్బెట్టి పావులీటరుపాలు కొంటున్నాను. నా సర్వీసులో ఎప్పుడూ కొన్లేదు. ఈ స్టేషన్లో మొట్టమొదటిసారి కొన్నానండీ! కాష్ పెట్టి పాలుకొన్నాను. థూ వెధవ స్టేషన్" కనీళ్ళ పర్యంతం అయిందా టి.సి.కి డబ్బు సంగతి తల్చుకోగానే.

ఈలోగా గార్డూ, డ్రయివరూ కూడా వచ్చి చేరారక్కడ.

"ఏమయింది?" అడిగాడు గార్డు.

స్టేషన్‌మాస్టరు కథంతా చెప్పాడు గార్డుకి.

"అయితే వీళ్ళ గొడవమూలాన బండి ఎంతసేపు ఆపుతాం? స్టార్ట్‌చేసేస్తాను" అన్నాడు గార్డు.

“ఎట్లా స్టార్ట్ చేస్తావయ్యా!” నీ జగ్గులోపాలు పోయించుకోలేదా?” అడిగాడు పాలతను కోపంగా.

“పోయించుకుంటే గంటసేపు ఆపమంటే ఎలా? ఏదో ఓ అరగంటంటే ఫర్లేదుగానీ! అవతల మా ఆఫీసర్లు కూడా మమ్మల్ని అడుగుతారు కదా!” అన్నాడు డ్రైవరు గార్డుని సపోర్టు చేస్తూ.

దాంతో పాలతను మరీ రెచ్చిపోయాడు.

“ఏటీ? మీ ఆఫీసరా? ఏం? మొన్న మీ ఆఫీసరుగారమ్మాయి పెళ్ళికి మా పాల వాళ్ళందరం కలసి ఫ్రీగా పాలుపోయలేదూ? బెజవాడలో ఏ ఆఫీసరింట్లో ఏం జరిగినా మాకేగా నష్టం? మరింకా ఏ మొఖం పెట్టుకుని బెదిరాస్తావయ్యా మమ్మల్ని?”

ఆ జవాబుతో గార్డు డ్రైవరూ వెళ్ళిపోయారు–

నేను టైమ్ చూసుకున్నాఁ. అరగంటైపోయింది. అప్పటికి! ఇక లాభం లేదని నేనే కలుగజేసుకున్నాను.

“ఇదిగో చూడండి టి.సి.గారూ! అయిందేదో అయింది! ఇక రైలుని వదిలేస్తే మేము బెజవాడలో ఆఫీసుకెళ్ళాలి!” అన్నాను బ్రతిమాలుతో

“ముందు మీ టికెట్ చూపించండి!” అన్నాడు టి.సి. కోపంగా.

నేను సీజన్ టికెట్ తీసి చూపించాను.

ఫోటోవంక– నావంక రెండు నిమిషాలు పరీక్షగా చూసి టికెట్ నాకిచ్చేశాడు మళ్ళీ.

మొత్తం రైల్లోని జనం అంతా వచ్చిచేరారప్పటికి!

“ఇదిగో చూడు బాబూ! నువ్వన్నా ఆయనకొ్కంచెం పాలుపోయవయ్యా! మాకు టైమవుతోంది!” అన్నాడు మరో ప్రయాణీకుడు పాలతనిని బ్రతిమాల్తూ.

“ఎందుకు పోయాలండీ? అతని గేదెలు రెండు ఎండిపోయ్యాయట? ఎలా పోస్తాడు?” ఇంకో పాలతను రావుడిని సమర్థిస్తూ మాట్లాడాడు.

ప్రయాణికులు అందరూ కలిసి పాలతనినీ, టి.సి.నీ బ్రతిమాలి రైలు స్టార్ట్ చేయడానికి వప్పించారు.

అందరం ‘హమ్మయ్య’ అనుకుని రైలెక్కాం. సడన్‌గా ఓ బిచ్చగాడు, ఓ చిన్నపిల్లా పాట అందుకున్నారు. ప్రయాణీకులు “శ్రోతలు కోరిన రికార్డులు” పాడిస్తున్నారు, వరుసగా! రైలు మళ్ళీ బయలుదేరింది.

పాతకోటు, భుజాన పెట్టెతగిలించుకున్న వ్యక్తి మా కారేజ్‌లో కొచ్చాడు.

“పట్నంలో పళ్ళడాక్టర్లకి ఇరవైలు, ముప్ఫయ్‌లు ఖర్చుపెడతారు సార్! అంత డబ్బు వృధా చేయకండి. కేవలం రెండు రూపాయలు అరవై పైసలకే మీ పళ్ళు పీకించుకోండి!

నాలుగు పళ్ళు పీకించుకున్న వారికి కన్సెషన్! గొప్ప దీపావళి బంపర్ ఆఫర్! నాలుగు పళ్ళూ కేవలం ఏడు రూపాయలే! ఆరు పళ్ళు పీకించుకున్నవారికి దువ్వెన ఉచితం! గొప్ప దీపావళీ బంపర్ ఆఫర్‌సార్. ఎవరికండీ పన్నుపీకాలి? మాష్టారూ! ఈ అద్భుతమైన అవకాశం జారవిడుచుకోకండి! నేను మళ్ళీ నెలరోజులవరకూ ఈ లైన్ మీదకు రానండీ! వైజాగ్‌లైన్ కెళ్ళిపోతున్నాను" కారేజంతా నాలుగు రౌండ్లు కొట్టాక మా పక్క కంపార్టుమెంటులోనే ఓ కేస్‌బుక్‌చేశాడతను.

"ఏ పన్నండీ బాబూ?"

"ఇదిగో ఇది... "

"ఆహహా! పూర్తిగా చెడిపోయిందండీ! పాపం మీరు ఎంత బాధపడతున్నారో."

"అవును తెగ బాధగా ఉందనుకో!"

"మరిదాని పక్కదాని మాటేమిటి? అదీ పాడయిపోయింది కదా?"

"అబ్బే! దాని బాదేం లేదు."

"లేకపోయినా ఇప్పుడే లాగేయటం మంచిదండీ! నేను మళ్ళీ నెలరోజుల దాకారానిటు. రేటు కూడా కొంచెం తగ్గిస్తాను."

"వద్దయ్యా దాన్నేం చేయకు"

"సరే! - ఆ మాష్టారూ! మీ నలుగురూ ఇతనిని గట్టిగా కదలకుండా పట్టుకోండి సార్! ఈ రోగిని కదలకుండా పట్టుకుని, మాధవసేవ చేయండి బాబూ! ఎంతసేపో అక్కరలేదు. అయిదు నిమిషాలు చాలు ఆపరేషన్ చేసేస్తాను."

ఆ చుట్టు పక్కలున్నాళ్ళందరూ కలిసి ఆ వ్యక్తిని గట్టిగా పట్టుకున్నారు. మరోక్షణంలో ఆపరేషన్ ప్రారంభమయింది.

"అబ్బా- బాబోయ్- నాయనోయ్- నన్ను వదలండ్రో- వ్వవ్వవ్వవ్వవ్వ-" ప్రాణం పోతున్నట్లు కేకలు వేస్తున్నాడా రోగి.

"ఇంకో నలుగురు పుణ్యాత్ములు వచ్చి ఇంకా గట్టిగా పట్టుకోండి సార్! మానవసేవే మాధవసేవ సార్! కేవలం రెండూ అరవైకే పన్ను ఎందుకు పీకుతున్నాను? మానవసేవే మాధవసేవ సార్!"

నా పక్కనున్న మరో నలుగురయిదుగురు కూడా వెళ్ళి ఆ వ్యక్తి మీదపడి శరీరం, నోరు, తల కదలకుండా నొక్కిపట్టారు!

మళ్ళీ ఆపరేషన్ రెండో ఘట్టం ప్రారంభమయింది.

మళ్ళీ కేకలు.

"వావోయ్ వావోయ్- వ్వా-వ్వా-వ్వా-అవ్వా-అవ్వా."

"అబ్బ! రక్తం చిమ్ముతోంది" అందో గొంతు.

"ఏవయ్యా– ఏమిటది, రక్తం పిచికారీ కొట్టినట్లు కొడుతోంది?" ఎవరో అడిగారు.

"పన్నులో చేవ ఎక్కువుందన్నమాటండీ! అంటే వీళ్ళు వంశమంతా బాగా చేవవున్న మనుషులన్నమాటండీ! మా గట్టి దంతవరుస! సర్వీసులో ఇంత జబర్దస్త్ దంతం పీకటం ఇది మూడోసారి మాత్రమే" రైలు ఆగిందోస్టేషన్‌లో.

"నా పన్ను పీకద్దు బాబోయి– నన్నిలా వదిలేయ్ దేవుడోయ్." అంటో అరుపులు.

"మధ్యలో ఎలా వదుల్తానయ్యా– నన్ను పన్ను పీకటం చేతకాని వాడనుకుంటా రందరు–"

"నేనీ స్టేషన్‌లో దిగాలయ్యా బాబూ! నన్నొదిలేయండి" తనను పట్టుకుని మీదెక్కి కూర్చున్నవారిని బ్రతిమాలసాగాడతను.

"ఏం ఫర్వాలేదయ్యా! గొడవచేయకు. ఇంకొక్క జర్కు ఇచ్చానంటే తకీమని వూడిపోతుంది."

"రైలు బయల్దేరుతుందయ్యా బాబూ! దిగిపోతాను."

పళ్ళుపీకే వ్యక్తి ఓక్షణం ఆలోచించాడు.

"సరే– నేనిప్పుడే వెళ్ళి ఓ పావుగంటబండి ఆపమని గార్డుగారితో చెప్పివస్తానుండు."

నేనూ నా పక్కనున్న వాళ్ళు అదిరిపడ్డాం.

"ఏమిటి? గార్డుగారితో బండి ఆపమని చెప్తావా?"

"అవునండీ! ఏం ఫరవాలేదు! నేను చెప్తే ఆపేస్తారులెండి! ఒకసారి ఆయన కుక్కకి నేనే పన్ను పీకేశాను? ఒక్క పైసాకూడా తీసుకోలేదు"

"కుక్కకా?" ఒకాయన ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును సాధారణంగా కుక్క పళ్ళు పీకనులే? అయితే ఏదయినా పెద్ద రికమడేషనుంటే పీకేస్తాను! జంతుసేవే మాధవసేవ..."

అతనుగార్డు దగ్గరకెళ్లి వెంటనే తిరిగొచ్చాడు.

రైలు ఆగిపోయింది.

మళ్ళీ ఆపరేషన్ మూడో ఘట్టం (అంతిమ ఘట్టం) ప్రారంభమయింది.

"ఈసారి ఇంకాకొంచెం గట్టిగా పట్టుకోండి! సార్! మనం కోడి మెడెలా పట్టుకుంటాం? అలా నొక్కి పట్టుకోండి! ఒకే ఒక జర్క్‌తో ఊడిపడాల్సిందే."

అందరూ అతనిని బలవంతంగా పట్టుకుని నొక్కిపట్టారు.

ఒక్కసారిగా అతను పిచ్చికేక వేశాడు.

అతనిని పట్టుకున్నవాళ్ళిద్దరు ఎగిరిపడ్డారు దూరంగా.

"హమ్మయ్య! వచ్చేసింది!" అన్నాడు పళ్ళుపీకే అతను, తన చేతిలో కటింగ్ ప్లేరు మధ్యనున్న పంటిని అందరికీ ఉచిత ప్రదర్శన ఇస్తూ! కిందపడున్న వ్యక్తి మూలుగుతూ లేచి తనసంచీ తీసుకు కిందకుదిగాడు. పళ్ళుపీకే వ్యక్తి కూడా ప్లాట్‌ఫారం మీదదిగి గార్డుకి చేయి ఊపగానే బండి మళ్ళీ స్టార్టయింది.

అయితే మళ్ళీ పక్క స్టేషన్‌లో ఆగిపోయింది.

"మళ్ళీ ఏమిటీ?" అన్నాడు ఒకతను బయటకు చూస్తూ

"మళ్ళీ ఇంకోరైలు క్రాసింగ్!" అరగంట తర్వాత మళ్ళీ బయల్దేరిందిగానీ, కొద్దిదూరం వెళ్ళి మళ్ళీ ఆగిపోయింది.

మరుక్షణంలో అన్ని పెట్టెల్లోకి బిలబిలమంటూ ఆర్.పి.ఎఫ్.వాళ్ళు, టి.టి.ఇ.లు ఎక్కేశారు.

"టికెట్, టికెట్" అంటూ నాలుగువేపులున్న తలుపుల దగ్గర అడ్డం నిలబడి అందరి టికెట్లూ చెకింగ్ చేయసాగారు.

"ఇక్కడ చెక్కింగేమిటి?" అడిగాను పక్కనున్నతనిని.

"స్క్వాడోళ్ళు వచ్చారండీ! స్పెషల్ చెక్ అన్నమాట!"

మా కారేజ్‌లోనే సగంమందికి పైగా టికెట్‌లు లేకపోవడం చూసేసరికి నాకు ఆశ్చర్యం కలిగింది.

అందరినీ పక్క స్టేషన్‌లో దింపారు.

పావుగంట గడిచినా రైలు మళ్ళీ కదలకపోయేసరికి నేనూ మిగతావాళ్ళూ కిందకు దిగాము.

స్టేషన్‌మాస్టర్ ఆపీసు బయట టికెట్ లేనివాళ్ళ గుంపు నిలబడి ఉన్నారు. వాళ్ళకెదురుగా టి.టి.ఇ.లు, ఆర్.పి.ఎఫ్. వాళ్ళు నిలబడ్డారు.

"అవునండీ! మీది స్పెషల్ చెకింగ్ స్క్వాడే! వప్పుకుంటాం. కానీ ముందు పాసింజర్లకు చెప్పకుండా ఇలా హఠాత్తుగా చెకింగ్ కొస్తే ఎలా? ఇప్పుడు చూడండి! ఇంతమందిమి టికెట్లు కొనలేదు." అన్నాడు గుంపులో నుంచి ఒక ప్రయాణీకుడు.

"మమ్మల్నేం చేయమంటారండీ! మా ఆఫీసరుగారు 'ఎటాక్' చేయమన్నారు." అన్నాడు ఒక టి.టి.ఇ.

"ఆయన్చెప్తారులేవయ్యా? చెప్తే చేసేయటమేనా? మాకు రెండు స్టేషన్లముందే ఇలా మధ్యలో స్పెషల్ చెకింగ్ జరుగుతోందని తెలియజేస్తే మేము టికెట్ కొనుక్కుంటాం అని ఎన్నిసార్లు చెప్పాలి మీకు?" ఇంకో మీసాలాయన దబాయించాడు.

"మా ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడండయ్యా! మాకేం తెలుసు. అక్కడికీ మేం చెప్తూనే వున్నాం! ముందు చెప్పకుండా ఇలా సడెన్ చెకింగ్ చేస్తే పాసింజెర్స్ వప్పుకోరు సార్ అని! ఆయన వింటేనా? డి.సి.యస్. ప్రోగ్రాం ఆఖరిక్షణంలో ఇచ్చారు గనుక మనమేం చేయలేము. అన్నారు–" ఒక టి.టి.ఇ.

"ఏడి మీ ఇన్‌స్పెక్టర్‌ని పిలు.మేము మాట్లాడతాం." అన్నాడు మీసాలరావు.

స్టేషన్‌మాస్టర్ ఆఫీసులో నిలబడ్డ ఇనస్పెక్టర్ బయటికొచ్చాడు.

"ఇదిగో చూడండి బాబూ. ఈ ఒక్కసారికి పొరపాటు జరిగింది. మీకు మా స్పెషల్ చెక్ గురించి ముందే తెలియజేసేంత టైముకూడా లేకపోయింది." అన్నాడు ఇన్‌స్పెక్టర్ వినయంగా.

"అదేంకుందరదండీ, మీ చెకింగ్ కాన్సిల్ చేసేసుకోండి. కావాలంటే రేపు చెక్ చేసుకోండి వప్పుకుంటాం" అన్నాడు ఇంకోలావుపాటి వ్యక్తి.

"సర్‌ప్రైజ్–చెకింగ్ ఎలా కాన్సిలవుంది? కుదరదుకదా" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఏం ఎందుక్కుదరదు? పెద్ద పెద్ద విజిలెన్స్ చెక్‌లే కాన్సిల్ చేయించాం. మీ చెకింగో పెద్ద లెఖ్ఖేమిటి?" ఇంకెవరో అరిచారు.

"అవును! కాన్సిలు చేసి మీరు వెళ్ళిపోవలసిందే." అన్నాడు ఇంకో కుర్రాడు. ఇన్‌స్పెక్టరూ, టి.టి.ఇ.లూ మొఖమొఖాలు చూసుకున్నారు.

"మేము ముందే చెప్పాం కద్సార్. తెల్లారిలేస్తే మొఖమొఖాలు చూసుకోవాలి. చెప్పకుండా చెకింగ్ చేయడం బాగుండదని" గొణిగాడు ఒక టి.టి.ఇ.

"సరే! పదండి! రేపు చేద్దాం చెకింగ్ ఇక్కడ" అన్నాడు ఇన్‌స్పెక్టర్. ప్రయాణికులంతా ఆనందంగా మళ్ళీ రైలెక్కేశారు.

ఇక టి.టి.ఇ. అందరి దగ్గరకొచ్చి గట్టిగా చెప్పసాగాడు.

"ఇదిగో, రేపు ఇదే బండికి స్పెషల్ చెక్‌చేస్తున్నారు. ఇక్కడే ఈ స్టేషన్‌దగ్గరే. కనుక మళ్ళీ చెప్పలేదనకండి."

రైలు కదిలింది. కానీ మళ్ళీ ప్లాట్‌ఫారం దాటగానే మళ్ళీ ఆగిపోయింది. బటానీలవాడు బండి ఎక్కడం మిస్ అయ్యాడట.

"అబ్బా, ఇప్పటికే రెండు గంటలులేటయిపోయింది బండి." అన్నాన్నేను. దిగులుగా, నా పక్కనున్నవాళ్ళు నావంక ఆశ్చర్యంగా చూశారు.

"లేటేమిటి?"

"అదే– ఆలస్యం–" అన్నాను.

"ఈ బందరు-బెజవాడ లైనులో అలాంటివేమీ ఎవ్వరూ అడగరు" అన్నాడు ఒకతను. "బండి ఎప్పుడెళ్ళినా రైట్ టైమ్ అనే అనే రాసేసుకుంటారు!"

ఈసారి రైలు బయలుదేరి స్టేషన్ రాకుండానే ఆగిపోయింది.

"మళ్ళీ ఏమయింది?" అడిగాను చిరాగ్గా.

అందరూ కిటికీలోనుంచి చూశారు.

కొద్దినిమిషాల తర్వాత డ్రైవర్ నడుస్తూ గార్డు పెట్టివేపు వెళ్ళసాగాడు.

"ఏమయిందిగురూ?" ఎవరో పాసింజర్ అడిగాడు డ్రైవర్ని.

"ఎవరో గొలుసులాగారు-" అంటూ వెళ్ళి మళ్ళీ పది నిమిషాల తర్వాత తిరిగి వచ్చాడు.

"ఎవరు లాగారు?" అడిగాడు పాసిజంరు మళ్ళీ.

"గార్డు వాక్యూమ్ వేశాడు" అంటూనే వెళ్ళిపోసాగాడతను.

"ఎందుకు?"

డ్రైవరు జవాబు చెప్పలేదు.

మరో రెండు నిమిషాల్లో బండి స్టార్లయింది. గానీ మళ్ళీ వెంటనే ఆగిపోయింది.

"మళ్ళీ ఏమయింది?" అడిగాడు ఇంకో పాసింజెరు వళ్ళు మండిపోతుంటే. అందరూ కిందకుదిగి డ్రైవరుతోపాటు చివరివరకూ నడిచివెళ్ళారు.

పదినిమిషాల తర్వాత తిరిగి వచ్చారు.

"ఏం జరిగింది?" అడిగాను.

"గార్డు మందుకొట్టేశాడు. అందుకని మాట్లాడితే వ్యాక్యూమ్ వేస్తున్నాడు" అన్నాడు ఒకతను.

"అదేమిటి! మందుకొట్టినా ఎందుకలా బండి ఆపటం?"

"ఆ గార్డంతే సార్! మందుకొడితే చాలు- వాక్యూమ్ వేసేస్తుంటాడు."

"అసలు డ్యూటీలో మందుకొట్టటమేమిటి?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఛ ఛ! ఆయన మంచాడు సార్! ఎప్పుడూ కొట్టడు. ఇవాళ వాళ్ళ పండగట! అందుకని కొట్టేస్తున్నాడు."

రైలు మళ్ళీ బయలుదేరి పక్క స్టేషన్‌లో ఆగిపోయింది.

ఓ ముసలాడు కోతితోసహా మా కారేజ్ ఎదురుగా ప్లాట్‌ఫారం మీద దుకాణం పెట్టాడు.

"అయ్యగార్లకు దణ్ణంపెట్టు" అన్నాడు. కోతి స్టేషన్‌మాస్టరుకీ, బఠానీలవాడికీ నమస్కారం పెట్టింది.

అదిచూసి ప్రయాణికులు చాలామంది రైలుదిగి దాని చుట్టూ మూగారు.

"డ్రైవర్‌సాబ్‌కి సలాంపెట్టు!"

కోతి డ్రైవరుకి సలాం చేసింది.

"ఆఫీసర్లు లంచం ఎలా తీసుకుంటారు?"

కోతి వీపు వెనుకచేయి చాచింది.

అందరూ ఘొల్లుమన్నారు.

"జయమాలిని డాన్స్ చేస్తుంటే ఎలా చూస్తావ్?"

కోతి నాలుక బయటపెట్టి గుడ్లు మిటకరించింది. ఎగురుతూ యాక్షన్ చేసింది.

"ఆ టైమ్‌లో హఠాత్తుగా మీ ఆవిడవస్తే ఎలా చూస్తావ్?"

కోతికళ్ళు మూసుకుని నీరసంగా కూలబడింది.

గార్డుతూలుతూ వచ్చాడక్కడికి.

"గార్డుసాబ్‌కి సలాంపెట్టు!"

కోతిగార్డుకి సలాం చేసింది.

"భార్యకు తెలీకుండా సెకండ్ షో కెళ్ళి ఇల్లు ఎలా చేరుకుంటావ్?

కోతి దొంగలా నక్కి నక్కి నడిచింది.

నేను స్టేషన్ మాస్టరు దగ్గరకెళ్ళాను.

"ఆ కోతి ఆట అయ్యేవరకూ రైలు కదలదాసార్?"

"ఏమోమరి! వాడు కోతిని చాలా రోజుల్తర్వాత తీసుకొచ్చాడు సెక్షన్‌లోకి" అన్నాడాయన కోతిని ఆనందంగా చూస్తూ.

"నేనడిగేది రైలు సంగతి!"

"నేననేది కోతి సంగతి! వండర్‌ఫుల్ ఫీట్స్‌చేస్తోంది చూశారా?"

"ఈ రైలు ఇంక బయలుదేరదా?" కోపంగా అరిచాను.

"ఎందుకు బయలుదేరదు?"

"బయలుదేరుతుందని తెలుసండీ! ఏ తారీఖు?" ఆయన కాలెండర్ చూశాడు.

"ఇవాళ్ళే- ఇప్పుడే"

"మరి కదలదేం?"

"గార్డూ, డ్రైవరూ టీ తాగి ఇప్పుడేగా వెళ్తోంది?"

నేను గార్డు, డ్రైవర్లకోసం చూశాను.

అప్పుడే బయలుదేరివెళ్తున్నారు వాళ్ళు.

మరో అయిదు నిమిషాల తర్వాత రైలు కదలింది.

అయితే ప్లాట్ఫారం దాటకుండానే మళ్ళీ ఆగిపోయింది. నేను, నా పక్కనున్నవారూ దిగి కారణమేమిటా అని చూశాము.

డ్రైవరుదిగి వస్తూ కనిపించాడు.

"ఏమయింది!" అడిగాను.

"ఇంకేముంది! గార్డుమళ్లీ వాక్యూమ్ వేశాడు."

అందరం కలిసి గార్డు దగ్గరకెళ్ళాం.

"అరె! వద్దంటే వాక్యూమ్ వేస్తావెందుకయ్యా?" అడిగాడు డ్రైవర్ కోపంగా.

"షారీ! అయామ్ షారీ"

"ఇదిగో గార్డుగారూ! ఇప్పటికే బోలెడాలీశెం అయిపోయిందయ్యా! ఇంక బండి ఆపకు. పాలు పాడయిపోతాయి" అన్నారు పాలవాళ్ళు.

"నేనాపను. ఆపమన్నాఆపణు. కావాలంటే షూడండి– ఆపణు" అందరం మళ్ళీ రైలెక్కాం.

రైలు కదిలింది.

"ఇంకెన్ని స్టేషన్లున్నాయ్" దిగులుగా అడిగాను.

"ఇంకెన్నండీ, రెండే."

'హమ్మయ్యా' అనుకున్నాను. కనీసం ఆఫీసుకి మధ్యాహ్నం నుంచయినా వెళ్ళవచ్చు.

కారేజ్‌లో మరో గిరాజాల జుట్టు ఎక్కింది.

"ఎవరికండీ మాష్టారూ– చెవిలో గుబులులాగేస్తాం? కేవలం రెండుచెవుల్లో గుబులుకి అర్ధరూపాయ్ మాత్రమే చార్జీ అండీ! గుబుల్ గుబుల్‌గా గుండెలు దడగా– ఎవరకండీ మాష్టారూ గుబులూ– నలుగురు కలసి గుబులు తీయించుకుంటే కీచైన్ ఉచితం సార్."

అప్పటికప్పుడే రెండు కేసులు దొరికాయి అతనికి. వాళ్ళిద్దరిచుట్టూ జనం మూగిపోయారు.

తీరా రైలు రెండు ఫర్లాంగులు వెళ్ళిందోలేదో మళ్ళీ ఆగిపోయింది.

"సందేహంలేదు గార్డుపనే మళ్ళీ" అన్నారు మా బోగీలో ఉన్నవాళ్ళు. అందరం కలసి గార్డు దగ్గరకెళాం.

"ఏమిటయ్యా గార్డుగారూ ఇది? అవతల పదకొండయిపోతోంది. మా పాలు పాడయిపోతాయి అని చెప్తుంటే వినకుండా బండి ఆపేస్తావేమిటి?"

గార్డు నవ్వాడు.

"లేపోతే ఆ వెంకట్రావ్ నాకేం ఫవర్‌లేదంటాడా?? రాస్కేల్! నా ఫవరేంటో ఇవాళ షూపిస్తా! అడుగడుక్కీబండి ఆపేస్తా"

"బాబోయ్! వద్దయ్యా స్వామీ నీకు దణ్ణం పెడతాం! బండి ఆపకు." పాలవాళ్ళు బ్రతిమాలారు.

"అయితే మరి వెంకట్రావ్ ఆకూత ఎందుక్కూషాడు-"

"ఆ వెంకట్రావ్ పని మేము చెప్తాం కదా! తమరు బండి ఆపకండి"

"షరే!"

రైలు మళ్ళీ కదిలి మరికాస్త దూరం నడిచి ఆగిపోయింది.

అందరం మళ్ళాగార్డు దగ్గరకెళ్ళాం.

"మళ్ళీ ఏమొచ్చిందయ్యా మగడా!"

"వెంకట్రావుగాడు లేడూ? ఆడు నన్ను 'బూష్' అని తిట్టాడు" రెండు చేతుల్తో తలపట్టుకుని దిగాలుగా అన్నాడు గార్డు.

"ఆడిపని మేము చూస్తాంలేవయ్యా! బండి ఆపకు."

"నిజంగా ఆడి భరతం పడతారా?"

"పడతాం సార్!"

"మరి వాడిని కూడా బూష్ అని తిడతారా?"

"తప్పకుండా తిడతాం!"

"ఏమని తిడతారు?"

"బూష్ అనే తిడతాం!"

"బూష్ కాదు? బూష్ అని తిట్టాలి"

"బూష్ అనే తిడతాం లేవయ్యా బండి పోనీ! జండా చూపించు!"

"బూష్ కాదని షెప్తుంటే వినరేం?"

"మరేమని తిట్టాలి?"

"బూష్!"

"సరే! అలాగే తిడతాంలే నాయనా!"

"ఏమని తిడతారు?"

"అదే బూష్ అని చెప్పావుగా?"

"బూష్‌కాదు."

"మరి"

"బూష్-బూష్-"

"బూష్ బూష్" అన్నాడు పాలవాడు.

"బూష్ కాదహో!"

నేను కల్పించుకున్నాను.

"బ్రూట్ అని తిట్టాలి! అంతేగదా?"

"ఆ! అది! బూష్!"

"సరే తిడతాంలెండి! జెండా చూపించండి!"

"నేను షూపించను–"

"అదేవిటి? వెంకట్రావ్‌ని మేము తిడతామన్నాంగా?"

"వాడిని నేనే తిట్టాలి."

ఈలోగా మీసాలాయన దిగివచ్చాడు. "ఒరేయ్ ఇక లాభంలేదుగానీ బఠానీల వాడిని పిలవండి" అన్నాడు పరిస్థితి ఆకళింపు చేసుకుని.

"బఠానీల వాడెందుకు?" అడిగాను ఆశ్చర్యంగా.

"వాడొక్కడికే గార్డు ఉద్యోగం, ఇంజన్ డ్రైవ్‌చేయటం తెలుసు. ఇంకెవ్వరికీ తెలీదు!"

కొంతమంది వెళ్ళి బఠానీలవాడిని పట్టుకొచ్చారు.

"ఒరేయ్‌సోమిగా! ఈ గార్డుని మేము పక్కపెట్లోకి తీసుకుళ్తాం గానీ, కొంచెంగార్డు ఉద్యోగం చేయ్, బండిలేటయిపోతోంది" అన్నాడు మీసాలాయన.

రైలు ఈసారి హాయిగా రామపరప్పాడువరకూ శుభ్రంగా నడిచింది.

టైము చూచుకున్నాను.

ఒంటి గంట! బండి పావుగంటయినా కదలకపోయేసరికి మళ్ళీ అందరం బఠానీలవాడి దగ్గరకెళ్ళాం.

ఇంక మధ్యాహ్నం ఆఫీస్ కెళ్ళాలంటే సరిగ్గా అరగంట టైముంది.

'ఏమయింది?" అనడిగారువాడిని.

"ఇంజన్లో ఎవరో సేఫ్టీ ఆఫీసరొచ్చారంట సార్! నేను జెండా చూపించకూడదని పట్టుబడుతున్నారు." అందరూ మళ్ళీ ఇంజన్ దగ్గరకెళ్ళి సేఫ్టీ ఆఫీసర్ని–డ్రైవర్ని బ్రతిమాలారు. "మీ ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్‌లో గార్డు పనిచేస్తున్నట్లే రాసుకోండిసార్! మాకిప్పటికే ఆలస్యం అయిపోయింది" సేఫ్టీ ససేమిరా ఒప్పుకోలేదు గానీ పాలవాళ్ళు పదిరూపాయలిచ్చాక ఒప్పుకున్నాడు.

మళ్ళీ కదిలింది రైలు.

స్టేషన్ వచ్చేసింది.

అయిదు నిమిషాలు గడిచింది. ఆ తరువాత పదినిమిషాలు, పావుగంటకూడా అయిపోయింది. బండికదలటం లేదు.

మళ్ళీ అందరం దిగి స్టేషన్ దగ్గరకు వెళ్ళాం.

టికెట్ కలెక్టరూ, బుకింగ్ క్లర్కూ కలిసి ఓ గుంపుతో పోట్లాడుతున్నారు.

“వీల్లేదయ్యా! బస్తాకి రెండ్రూపాయలు ఇవ్వాల్సిందే. లేకపోతే మిమ్మల్ని వదిలేది లేదు–”

“బియ్యం మేమిక్కడదింపటం లేదు సార్. బెజవాడ తీసుకెళ్తున్నాం ఇంక మీకెందుకు మామూలివ్వాలి?” బియ్యం బస్తాలవాళ్ళడిగారు.

“ఇంతకాలం ఇక్కడ దింపి– ఇవాల్టినుంచి బెజవాడ తీసుకెళతారా? వీల్లేదు. ఇక్కడ దింపాల్సిందే.” పట్టుపట్టారు బుకింగ్ క్లర్క్, టి.సి.లు.

“మీరు బస్తాకి రెండు రూపాయలు అడుగుతోంటే ఇక్కడెందుకు దించాలండీ.”

“బెజవాడలో ఎంత ఇస్తున్నారు?”

“రైల్వే పోలీస్‌కి రూపాయ్ మిగతా స్టాఫ్‌కి అర్ధరూపాయి.”

“ఓహో! అర్ధరూపాయి లాభం కొడుతున్నారన్నమాట. అందుకని మా నోట్లో మొత్తానికే మన్నుకొడతారా?”

“మీరు మరి రూపాయిన్నారకు వప్పుకోకపోతే మేమేం చేయంసార్?”

మీసాలాయన మళ్ళీ కల్పించుకున్నాడు.

“ఇదిగో బాబూ! బండి ఆపేసి లావాదేవీలేమిటయ్యా! మాకు అవతల లేటవుతోంది.”

“లేకపోతే చూడండి సార్! బియ్యం బస్తాలన్నీ బెజవాడ తీసుకెళతామంటున్నారు. రోజూ వచ్చే మామూలు మాకిదొక్కటే గద్సార్. ఇది కూడా లేకపోతే మేమేం తినాలి?”

మీసాలాయన బియ్యం వాళ్ళను కోపడ్డాడు.

“ఇదిగో రంగనాయకులూ! నువ్వు కూడా తొందరపడితే ఎట్టా? ఆ టి.సి.గారు, బుకింగ్ క్లర్క్‌గారు పరాయి వాళ్ళేంకాదుగదా? ఏదో రెండు డబ్బులు అటూ ఇటయినా ఇక్కడే దించుకోండి” ఈలోగా స్టేషన్ పోర్టర్ ఓ ముసలాడినీ రెండు మేకల్ని పట్టుకొచ్చాడు.

“సార్! ఈ మేకల్ని పాసింజర్ కంపార్ట్‌మెంట్‌లో తీసుకెళ్తున్నాడు సార్.”

“ఏరా! వాటిని బుక్ చేసి గార్డు పెట్టెలో తీసుకెళ్ళాలి కదా?” అన్నాడు బుకింగ్ క్లర్క్.

“పొరపాటయిపోయిందండీ.”

నేను ఇంక లాభం లేదని అక్కడే దిగిపోయి రిక్షాలో ఆఫీస్ చేరుకున్నాను.

“ఏమిట్రా! ఇప్పుడొచ్చావ్?” భగవాన్ అడిగాడు.

“చాలామంది బందరు వాళ్ళు రోజూ పొద్దున్న బెజవాడకు రైల్లో వచ్చి ఉద్యోగం చేసి మళ్ళీ సాయంత్రం బందరు వెళ్ళిపోతారని చెప్పావ్ గదా! ఆ రైలు ఇప్పటికి చేర్చిందిక్కడికి.” అన్నాను కోపంగా.

“కొత్తలో ఇలాగే ఉంటుందిలే. రాన్రాను అలవాటయిపోతుంది” అన్నాడు భగవాన్.

“కాని బస్‌లో గంటన్నర ప్రయాణం– రైల్లో ఇన్ని గంటలా?”

"తప్పదు మరి. పైసా ఖర్చులేకుండా బెజవాడ రావాలంటే అదొక్కటే మార్గం."

"పైసా ఖర్చులేకుండానా అదేమిటి? సీజన్ టికెట్ ఉందికదా!"

"అద్గదీ! అందుకే నీకింత చిరాకనిపించింది" నవ్వుతూ అన్నాడు భగవాన్ "ఈ రైల్లో ఎవడూ టికెట్ కొనడు–".



